# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 17-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు బిల్లుకు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గం ఆమోదం తెలిపింది.**
2. **ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ నమోదు కోసం ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు.**
3. **తెలంగాణలో పంట రుణాల మాఫీకి సంబంధించి రైతుల ఖాతాల్లో రేపు 6 వేల కోట్ల రూపాయలకు పైగా జమ చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.**
4. **భారతదేశ వృద్ధిరేటు 2024- 25 ఆర్థిక సం వత్సరానికి 7 శాతం ఉండొచ్చని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ తాజాగా అంచనా వేసింది.**
5. **అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ఈ రోజు అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో నిన్న జరిగిన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భూ యజమాన్య హక్కు చట్టం రద్దు బిల్లుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కొత్త ఇసుక విధానం, పౌరసరఫరాల శాఖ 2 వేల కోట్ల రూపాయల రుణానికి ప్రభుత్వం అనుమతి, తదితర అంశాలకు ఆమోదముద్ర వేశారు. నూతన ఇసుక విధానంపై త్వరలో విధివిధానాలు రూపొందించనున్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు నిమిత్తం నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎన్ సీడీసీ నుంచి 3 వేల 200 కోట్ల రూపాయల రుణానికి వ్యవసాయ, సహకార కార్పొరేషన్‌కు అనుమతిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈనెల 22వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. టేబుల్ ఎజెండాగా మరికొన్ని అంశాలపైనా చర్చించారు.

--------------------------

తాము కలిసికట్టుగా రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. నిన్న ఢిల్లీ చేరుకున్న ముఖ్యమంత్రి రాత్రి 9 గంటలకు హోం మంత్రి అమిత్ షా నివాసంలో ఆయనతో సమావేశమయ్యారు. గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక స్థితి దెబ్బతిన్న వైనం, రాష్ట్రంలో తలెత్తిన విధ్వంసక పరిస్థితుల గురించి తెలియజేయడానికి హోంమంత్రి అమిత్ షాను కలిసినట్లు ముఖ్యమంత్రి సామాజిక

మాధ్యమం ద్వారా తెలియజేశారు. ఇప్పటి వరకు విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాల్లోని అంశాల గురించి చర్చించామని.. 2019-24 మధ్య కాలంలో విపరీతంగా పెరిగిపోయిన అప్పుల భారం, దానివల్ల రాష్ట్ర ఆర్థిక ఇబ్బందులు చేయి దాటిపోయిన విషయాన్ని వివరించినట్లు తెలిపారు.

---------------------------

నీతి ఆయోగ్ ప్రత్యేక ఆహ్వానితులుగా కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు నియమితులయ్యారు. కేంద్రంలో కొత్త మంత్రివర్గం ఏర్పడిన నేపథ్యంలో నీతి ఆయోగ్ కూర్పును సవరించారు. ఎక్స్‌అఫీషియో సభ్యుల జాబితాలో వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను చేర్చారు. ప్రత్యేక ఆహ్వానితుల జాబితాలో మంత్రులు జేపీ నడ్డా, కింజరాపు రామ్మోహన్‌నాయుడు, హెచ్‌డీ కుమారస్వామి, జితన్‌రాం మాంఝీ, రాజీవ్ రంజన్ సింగ్, జూయెల్ ఓరం, అన్నపూర్ణాదేవి, చిరాగ్ పాస్వాన్‌ను చేర్చారు.

---------------------------

తెలంగాణలో పంట రుణాల మాఫీకి సంబంధించి రైతుల ఖాతాల్లో రేపు 6 వేల కోట్ల రూపాయలకు పైగా జమ చేయనున్నట్టు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిన్న రాష్ట్ర సచివాలయంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. భూమి పాస్‌బుక్ ఆధారంగానే రుణమాఫీ చేస్తామని, కుటుంబ నిర్ధారణకే రేషన్ కార్డు ప్రామాణికమని స్పష్టం చేశారు. అర్హులైతే రేషన్ కార్డు లేకున్నా రుణమాఫీ వర్తిస్తుందన్నారు. రాష్ట్రంలో 11 లక్షల 50 వేల మంది రైతులు లక్ష రూపాయల వరకు రుణాలు తీసుకున్నారని తెలిపారు. దాదాపు 30 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసేందుకు 31 వేల కోట్ల రూపాయలు అవసరమని మంత్రి వివరించారు.

---------------------------

ఆరు గ్యారంటీలను పారదర్శకంగా అమలు చేసే బాధ్యత కలెక్టర్లేదనని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. నిన్న హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పోలీసు కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో అధికారుల నిర్ణయాలు ప్రజలకు ప్రయోజనం కలిగేలా, మానవీయ కోణంలో ఉండాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రుల పర్యవేక్షణపై కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. ధరణి సమస్యలపై పెండింగ్ దరఖాస్తులు ఆగస్టు 15వ తేదీ నాటికి పరిష్కరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు జియో ట్యాగింగ్ విధానాన్ని పరిశీలించాలని తెలిపారు. రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డుకు లింకు పెట్టొద్దని స్పష్టం చేశారు. అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ రూపొందించాలని సూచించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ఆధార్ నమోదు కోసం ఈ నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వారీగా ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరి చేయడంతో ఇప్పటివరకు నమోదు చేయించుకోని వారి కోసం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. అవసరాన్ని బట్టి కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ శిబిరాలు నిర్వహణకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే జారీ చేసిన ఆధార్‌కు సంబంధించి, ఒక కోటి 36 లక్షల 17 వేల 47 మంది డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. 5 ఏళ్లలోపు వారికి కొత్తగా ఆధార్ నమోదు చేయాలి. ప్రత్యేక శిబిరాల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసేలా తగు ఏర్పాట్లు చేయాలని పురపాలక కమిషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ డైరెక్టర్ శివప్రసాద్ ఆదేశించారు.

---

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం అమలవుతోన్న విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత విధానం అమలు చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. నిన్న సాయంత్రం ఆయన ఉన్నత విద్యపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఫీజు రియంబర్స్‌మెంట్‌కు విధివిధానాలు తయారు చేయాలని సూచించారు. కళాశాలల్లో డ్రగ్స్ అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, డ్రగ్స్‌పై చైతన్యానికి స్వచ్ఛంద సంస్థల సాయం కోరాలని అధికారులకు మంత్రి లోకేశ్ సూచించారు. ప్రత్యేకంగా నోడల్ ఆఫీసర్ల నియామకాన్ని పరిశీలించాలన్నారు.

---

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సెక్రటరీ జనరల్‌గా సూర్యదేవర ప్రసన్నకుమార్‌ను నియమిస్తూ రాష్ట్ర శాసనమండలి నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రామాచార్యులు రాజీనామాతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ ప్రసన్న కుమార్‌ను నియమించింది. గతంలో ఆయన సుప్రీంకోర్టు రిజిస్ట్రార్‌గా పనిచేశారు.

---

తిరుమల తిరుపతి దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారి- జేఈవోగా 2005 బ్యాచ్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారి వెంకయ్య చౌదరి నియమితులయ్యారు. డిప్యూటేషన్‌పై ఆంధ్రప్రదేశ్‌లో ఆయన మూడేళ్ల పాటు పనిచేయనున్నారు. వెంకయ్య చౌదరిని డిప్యూటేషన్‌పై ఏపీకి పంపేందుకు కేంద్ర ప్రభుత్వం నిన్న ఆమోదం తెలిపింది.

---

భారతదేశ వృద్ధిరేటు అంచనాలను అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ -ఐఎమ్ఎఫ్ మరోసారి సవరించింది. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 7 శాతం వృద్ధి ఉండొచ్చని తాజాగా అంచనా వేసింది. ఏప్రిల్‌లో 6.8 శాతం వృద్ధి ఉండొచ్చని చెప్పిన ఐఎంఎఫ్.. తాజాగా మరో 20 బేస్‌పాయింట్లు పెంచి 7 శాతం వృద్ధి ఉండొచ్చని వెల్లడించింది. దేశీయంగా డిమాండ్ పెరగడంతోపాటు, పనిచేసే వయసు గల జనాభా పెరడగం వంటివి దీనికి దోహదం చేస్తున్నట్లు పేర్కొంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన అవకాశాలు పెరగడం కూడా వృద్ధిరేటును ప్రభావితం చేస్తున్నట్లు వెల్లడించింది.

---

ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యల పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ మేరకు దిల్లీలో కేంద్ర హోంశాఖ ఈ నెల 24వ తేదీన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయబోతోంది. దీనికి అన్ని వివరాలతో రావాలని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సమాచారం పంపింది.

---

అంతర్జాతీయ న్యాయ వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ఈ రోజు అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. రోమ్ శాసనాన్ని చారిత్రాత్మకంగా స్వీకరించిన రోజుకు గుర్తుగా జూలై 17వ తేదీని అంతర్జాతీయ న్యాయ దినోత్సవంగా జరపాలని 1998 సంవత్సరంలో ఐక్యరాజ్య సమితి నిర్ణయించింది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవంగా కూడా పిలుస్తారు. నేరాలలో బాధితులకు న్యాయం జరిగేలా చేయడం, అంతర్జాతీయంగా జరిగే క్రిమినల్ జస్టిస్‌కు మద్దతు ఇచ్చేలా ప్రోత్సహించడం వంటివి ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశాలు.

---

పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈ నెల 21వ తేదీన అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అన్ని పార్టీల సభాపక్ష నేతలు ఈ సమావేశంలో పాల్గొననున్నారు. రాష్ట్రస్థాయిలో అమరవీరుల దినం జరుపుకొంటున్న కారణంగా అఖిలపక్ష సమావేశానికి తాము హాజరుకాబోమని తృణమూల్

కాంగ్రెస్ ప్రకటించింది. 22వ తేదీ నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్నాయి. 23వ తేదీన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌ను ప్రవేశపెడతారు. ఆగస్టు 12వ తేదీ వరకూ సమావేశాలు జరుగుతాయి.

---------------------------

దేశ సర్వోన్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో కొత్తగా ఇద్దరు న్యాయమూర్తుల నియామకానికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఇటీవల కొలీజియం సిఫార్సు చేసిన జస్టిస్ ఎన్.కోటేశ్వర్ సింగ్, జస్టిస్ ఆర్.మహదేవన్‌లను న్యాయమూర్తులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

కేంద్ర రోడ్డు రవాణా రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈరోజు ఆంధ్రప్రదేశ్‌లోని అన్నమయ్య జిల్లా మదనపల్లెకు రానున్నారు. సత్సంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట 40 నిమిషాలకు ఆయన తిరుపతి నుంచి హెలికాప్టర్‌లో మదనపల్లెకు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల 30 నిమిషాల వరకు సత్సంగ్ ఆశ్రమంలో పర్యటించిన అనంతరం బాబాజీ ఆలయాన్ని ప్రారంభిస్తారు. రాత్రి 8 గంటలకు తిరుపతికి తిరుగు ప్రయాణమవుతారు.

======================